## వంగర పరమేశ్వరరావు

# ఆసరా

పక్షుల కిలకిలారావాలు ఉదయభానునికి మేలు కొలుపు గీతాలు ఆలపిస్తున్నాయి. ప్రభాత సూర్యుని పసిడి కిరణాలు భువిని కాంతి వంతం చేస్తున్నాయి.

తోటలోంచి కోసుకొచ్చిన మల్లె, జాజి, మందార, నందివర్ధన, పారిజాత పుష్పాలతో స్వామికి పూలహారాన్ని కడుతోంది సుందరరామయ్య మాష్టారి భార్య సీతారత్నమ్మ. ఒక పక్క తల్లికి సాయం చేస్తూ... మధ్యలో తండ్రికి కావల్సిన పూజాద్రవ్యాలను అందిస్తోంది సాహితి.

కొద్దిక్షణాల్లో మాలికలను అల్లి పూజామందిరంలోని సీత, రామ,లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను పూలమాలతో చక్కగా అలంకరించింది సాహితి.

పూజా మందిరంలోని సుందరరామయ్య మాష్టారి గాత్రం... 'కౌసల్యా సుప్రజా రామా...!' అంటూ భక్తి పారవశ్యంతో శ్రావ్యంగా లోకనాయకునికి భూపాలరాగం పాడుతోంది. ఉద్యోగ విరమణతో వయసు పైబడినా మాష్టారి కంఠంలో మాధుర్యం తగ్గలేదు.

పూజా కార్యక్రమం పూర్తి అయిన తర్వాత ''శ్రీ రామ చంద్రమూర్తి కృపా కటాక్ష ప్రాప్తిరస్తు! సరస్వతీ దేవి అనుగ్రహ సిద్ధిరస్తు... తథాస్తు...!'' అక్షింతలు చల్లి కూతుర్ని దీవిస్తూ అన్నారు మాష్టారు.

శ్రీరామచంద్రుని విగ్రహ పాదాల వద్ద వున్న పూలను అందుకొని భక్తితో కళ్ళకు అద్దుకుని జడలో తురుముకుంది సాహితి.

తీర్థప్రసాద వినియోగం అయిన తర్వాత నేరుగా తన గదిలోకి వెళ్ళారు సుందరరామయ్య మాష్టారు.

రామాయణ, భారత, భాగవతాలు మొదలుకుని ఇప్పటి ఆధునిక వివిధ సాహితీ ప్రక్రియలకు సంబంధించిన ఎన్నో పుస్తకాలు బీరువాలలో చక్కగా అమర్చబడి ఉన్నాయి.

తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ఎందరో సుప్రసిద్ధ సాహితీమూర్తుల చిత్రపటాలు గదిలోని గోడలపై వరుసక్రమంలో వేలాడుతున్నాయి.

ప్రతిరోజు పూజానంతరం తన దినచర్యలో భాగంగా చేసే పని... పాత గుడ్డను తీసుకుని పటాలపై శుభ్రంగా తుడిచారు. తర్వాత... పుస్తకాలు అమర్చిన బీరువా అద్దాలను దులిపారు.

ఉత్తమ అధ్యాపకునిగా ముఖ్యమంత్రి చేతులమీదగా తాను బహుమతి అందుకుంటున్న చిత్రపటాన్ని మెరిసే కళ్ళతో క్షణంపాటు చూసుకున్నారు. మనసు ఆనంద పారవశ్యంతో పులకించింది. అధ్యాపక వృత్తిలో ఎందరో విద్యార్థులను ఆదర్శంతులుగా తీర్చిదిద్దిన మధురక్షణాలు స్ఫురణకొచ్చాయి. అప్పుడప్పుడు పూర్వ విద్యార్థులు వచ్చితన క్షేమ సమాచారాలు అడుగుతుంటే... ఏదో తెలీని అనిర్వచనీయమైన మధురానుభూతి, ఆనందం, తృప్తి ఒక్కసారి ముప్పిరిగొంటాయి.

ఉపాధ్యాయ వృత్తి, సాహితీ సమాలోచన రెండూ తన రెండు కళ్ళుగా భావిస్తాడు మాష్టారు. ఆయన నిత్య సాహితీ కృషీవలుడు. ఎన్నో అద్భుతమైన అపూర్వ రచనలు ఆయన కలం నుంచి జాలువారి విమర్శకులను సైతం మెప్పించాయి. ఎన్నో ఆణిముత్యాల్లాంటి పాత్రలు, ఉన్నత సాహిత్య విలువలను సంతరించుకున్న అద్భుత మైన కథలు ఆయన చేతుల్లో ప్రాణం పోసుకున్నాయి. తెలుగు భాషపట్ల ఆయనకున్న మక్కువ దినదినం ఆయనలో ద్విగుణీకృతమవుతూనే వుంది.

పరాయి దేశస్థుడైనా.. భాష రాకపోయినా... తెలుగు భాషపట్ల మమకారంతో కష్టపడి నేర్చుకుని... పదాల అర్థాలను ఏర్చికూర్చి తెలుగు భాషా నిఘంటువును తయారుచేసి తెలుగు జాతికి అదించిన మహానుభావుడు సి.పి.బ్రౌన్ అంటే సుందరరామయ్య మాష్టారికి కొండంత ప్రేమ, అభిమానం.

ప్రతిరోజు ఆయన నిఘంటువును స్పృశించనిదే మాష్టారి మనసు కుదుటపడదు.

కాఫీ కలుపుకొచ్చిన సాహితి, పడక్కుర్చీలో కూర్చొని బ్రౌన్ నిఘంటువును పరికిస్తోన్న తండ్రిని చూసింది.

''నాన్నా! కాఫీ...'' అంటూ ఆప్యాయంగా కప్పును అందించింది.

మాష్టారు కప్పు అందుకుని కాఫీ తాగుతూ... ''అమ్మా! సాహితి! భాషాభివృద్ధికి మన పూర్వీకులు చేసిన శ్రమ, త్యాగం అమూల్యమైనవి! నిస్వార్థపూరితమైన వారి భాషా సేవలు మరువలేనివి! అవే తెలుగు సాహిత్య వికాసానికి ప్రాణం పోసి, బంగారు బాటలు వేశాయి...'' పారవశ్యంగా అంటూ ఎదురుగా వున్న సాహితీ మూర్తుల చిత్రపటాలను అపురూపంగా చూశాయి ఆయన నయనాలు.

తండ్రి మాటలకు స్పందిస్తూ... ''మీరన్నది నిజమే నాన్నా! ఏ జాతికైనా ప్రాణం భాషే! భాష అంతరించిన నాడు ఆ జాతికూడా కనుమరుగైనట్లే! మన పూర్వీకులు ఒనరించిన భాషా సేవలు నభూతో న భవిష్యతి! ఎంతైనా వారి ఋణం మనం తీర్చుకోలేనిది!'' భాషా పండితుల ఔన్నత్యాన్ని కొనియాడుతూ అంది సాహితి.

కానీ కొడుకు భరత్ ఇంజనీరింగ్ చదవటం, విదేశాలకు వెళ్ళటం సుందరరామయ్యకుసుతరామూ ఇష్టం లేదు.

తెలుగు భాషకు చేయాల్సిన సేవలు, దానిని రక్షించుకోవడానికి సలపాల్సిన కృషి గురించి కొడుకు భరత్‌కు ఎన్నోసార్లు చెప్పటానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు సుందరరామయ్య మాష్టారు. ఆయన చర్యలన్నీ బెడిసి కొట్టాయి.

''బావా! వాడికిష్టంలేని చదువును ఎలా చదువుతాడు. చివరకు విసుగెత్తి వాడేదన్నా అఘాయిత్యం చేసు కుంటే... మనకుఎంత మనఃక్షోభ! కాలాన్నిబట్టి మనమూ మారాలి. పిల్లల మనస్తత్వాలు ఎరిగి మసలుకోవాలి. మూర్ఖంగా పోతే కడుపుకోతతో కుమిలిపోవాలి. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకుంటే ఎవరికి లాభం! చివరకు నష్టపోయేది నీవే! ఆలోచించు...'' అంటూ బావ మరిది చెప్పిన మాటలు కొడుకు చదువు గురించి ఆశలు పెట్టుకున్న మాష్టారికి ములుకుల్లై బాధపెట్టాయి. ఆయనలో పొంగే భాషాభిమానంపై నీళ్ళు చల్లినట్లు అయ్యింది.

''పోనీలెండి! వాడి ఇష్టప్రకారమే చదువుకోనీ... బిడ్డ సలక్షణంగా వుంటే... అంతేచాలు!...'' అన్న భార్య సీతారావమ్మ మాటలు ఆయనలోని ఆలోచనలను కట్టడి చేశాయి.

''చూడు సుందరరామయ్యా! మనం అనుకున్నవన్నీ జరిగితే... మనకూ... దేవుడికీ తేడా ఏముంటుంది? మన ఆలోచనలను పిల్లలపై రుద్దటం మంచిదికాదు. చదువుకోనంటే బాధపడాలి కానీ... చదువుతానంటే ఎందుకు అడ్డుచెప్పాలి. భాష, సేవ ఇత్యాది పనులు నువ్వు చేస్తున్నావు చాలు! ఇష్టాయిష్టాలు, ఆలోచనలు ఎవరి మనసునుబట్టి వాళ్ళకుంటాయి. మనచేతుల్లో ఏముంది చెప్పు! అయినా నీ ఆలోచనలకి కార్యరూపం ఇస్తున్న బంగారం లాంటి నీ కూతురు సాహితి వుంది కదా! మనం బిడ్డల్ని కనగలమేకానీ... వాళ్ళ తలరాతల్ని కనగలమా? మీ వాడి కోరిక ప్రకారమే ఇంజనీరింగు చదివించు...'' అన్న స్నేహితుడు జగదీశ్వరరావు హితవచనాలు గుర్తొచ్చాయి.

కూతుర్ని - కొడుకును పోల్చుకుంటూ పరిపరి విధాలు ఆలోచిస్తోన్న సుందరరామయ నోటి వెంట- ''ఒకే చెట్టుకి రెండు భిన్న ఫలాలు...'' అప్రయత్నంగా వచ్చాయి మాటలు.

''ఏంటి నాన్నా! ఏదన్నా రాయాల్సిన కథ గురించి ఆలోచిస్తున్నావా? సాయంత్రం కాలేజీ నుంచి వచ్చిన తర్వాత రాస్తాను! టైమ్ అవుతోంది! వెళ్ళివస్తా...''

చకచకా వెళ్ళింది సాహితి.

విశ్వనాథ వారి వేయిపడగలు చదవటంలో లీన మయ్యారు సుందరరామయ్య గారు.

❖ ❖ ❖

కాలేజీలో 'స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమా?' అన్న అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించటానికిపేరు నమోదు చేసుకుంటున్నారు.

సాహితి కూడా పేరు ఇచ్చింది. పోటీలకు న్యాయ నిర్ణేతగా కొత్తగా వచ్చిన తెలుగు లెక్చరర్ కిరణ్ కుమార్ వ్యవహరిస్తున్నాడని తెలిసింది.

మూడు నెలల క్రితం ట్రాన్స్‌ఫర్‌పై ఆ కాలేజీలో అడుగు పెట్టిన కిరణ్ కుమార్ విద్యార్థుల అభిమానాన్ని అతికొద్ది కాలంలో చూరగొన్నాడు. అతని పాఠం అంటే విద్యార్థులంతా చెవికుంటున్నారు. గతంలో తెలుగు క్లాసంటే బయటకు పరిగెత్తేవారు స్టూడెంట్స్. కానీ కిరణ్ కుమార్ వచ్చిన తర్వాత ఒక్క విద్యార్థికూడా క్రమం తప్ప కుండా హాజరవటం చూసి మిగతా లెక్చరర్స్, ప్రిన్సిపాల్ అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు.

సబ్జెక్టును బోధించటంలో అతనికున్న ప్రావీణ్యాన్ని చూసి మెచ్చుకున్నారు. పాఠ్యాంశాన్ని ఆకట్టుకునే విధంగా విద్యార్థుల మనసుకు హత్తుకుపోయేటట్లు చెప్పటం కిరణ్‌కుమార్ ప్రత్యేకత. ప్రశాంత వదనంతో, విద్యార్థులు వేసే అల్లరి ప్రశ్నలకు సహనంతో, చెదరని చిరునవ్వుతో చెప్పటంలో అతనిది ఓ ప్రత్యేక శైలి.

ఆరోజు డిగ్రీ చివరి సంవత్సరం వాళ్ళకు క్లాసు తీసుకుని బయటకు వస్తున్నాడు కిరణ్ కుమార్.

"నమస్తే సార్!..." అన్న పిలుపుతో చూశాడు. ఎదురుగా సాహితి. తన క్లాసులో బుద్ధిగా పాఠం వింటూ... మధ్య మధ్యలో సబ్జెక్టు గురించి మంచి ప్రశ్నలు వేసే ఆమె తెలివి తేటలు రోజూ గమనిస్తూనే ఉన్నాడు. తెలుగు భాష పట్ల ఆమెకున్న ఆసక్తి, ప్రేమ ప్రశంసనీయం.

వక్తృత్వ పోటీ గురించి వివరాలు అడిగి తెలుసు కుంది. ఇచ్చిన అంశంపట్ల తనకు అవసరమైన సలహాలు, సూచనలు అడిగింది.

"వెరీగుడ్ సాహితి! అందరూ కంప్యూటర్లంటూ పరిగెత్తే ఈరోజుల్లో నీలాంటి వారు చూపుతున్న భాషాభిమానం మెచ్చుకోదగ్గది!" ఆమె అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ అభినందిస్తూ అన్నాడు కిరణ్ కుమార్.

ఆయన మాటలకు "మీలాంటి ప్రోత్సహించే గురువుంటే... మేము ఎంతైనా సాధించగలం..." కృతజ్ఞతా పూర్వకంగా అంది సాహితి.

ఆరోజు జరిగిన పోటీల్లో చక్కగా, తెలివిగా మాట్లాడి... అందరికన్నా ఎక్కువ మార్కులు సాధించింది. బహు మతి ప్రదానోత్సవ కార్యక్రమంలో సాహితిలో ప్రజ్ఞను అందరూ కొనియాడారు. కిరణ్ కుమార్ ఆమెను ప్రశం సించాడు.

కొద్ది నెలల తర్వాత సంవత్సరాంతపు పరీక్షలు ముగిసాయి. ఆరోజు వీడ్కోలు సభలో విద్యార్థులందరూ తమ కాలేజీ అనుభవాలను పంచుకున్నారు.

సభ ముగిసిన తర్వాత ఆటోగ్రాఫ్ కోసం కిరణ్‌కుమార్ దగ్గరకు వెళ్ళింది సాహితి.

ఆటోగ్రాఫ్ ఇస్తూ..."తర్వాత ఏం చేయబోతున్నావ్!" అడిగాడు.

"ఎం.ఏ. తెలుగు చేయాలనుకుంటున్నాను సార్! మా నాన్నగారి ఆశయాలకు ఆసరా అవ్వాలనుకుంటు న్నాను సార్!" అంది సాహితి భవిష్యత్తు పట్ల ఉత్సా హంతో సాలోచనగా.

'ఈ కంప్యూటర్ యుగంలో అందరూ టెక్నికల్ కోర్సుల్లో శిక్షణ తీసుకుంటూ పరుగుతీస్తుంటే... ఈ అమ్మాయి ఇలా... పైగా తండ్రి ఆశయాలు అంటోంది... ఎవరో....' ఆశ్చర్యపోయాడు కిరణ్‌కుమార్. ఒకసారి వెళ్ళి వాళ్ళ నాన్నగార్ని చూడాలనిపించింది. అదేమాట సాహితితో చెప్పాడు.ఆనందంతో ఆమె మనసు ఉద్విగ్న భరితమైంది. వెంటనే కిరణ్‌కుమార్‌తో కలిసి ఇంటికి బయలుదేరింది.

❖ ❖ ❖

చుట్టూ పచ్చని చెట్లతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో పెంకుటిళ్ళు... అక్కడ అడుగుపెట్టగానే ఏదో తెలీని పారవశ్యానికి లోనయ్యాడు కిరణ్‌కుమార్.

చెక్కపై 'సుందరరామయ్య! రిటైర్డ్ తెలుగు మాష్టారు!' వున్న అక్షరాలు చదివి..."...అంటే...మీ నాన్నగారూ!..." ప్రశ్నార్థకంగా ఆగిపోయాడు కిరణ్‌కుమార్.

"మా నాన్నగారు జెడ్.పి.హైస్కూల్స్‌లో పనిచేసి రిటైర్ అయ్యారు..." అతని ముఖంలోని భావాలను గమనిస్తూ వుంది సాహితి.

ఆమె మాటలకు ఏవో బాల్యస్మృతులు లీలగా మెదిలాయి అతని ఎద లోతుల్లో...

దిక్కూ మొక్కూ లేని తనకు గవర్నమెంటు హాస్టల్‌లో సీటు ఇప్పించి... తెలుగు భాషను గురించి తీయని మాధుర్యాన్ని రుచి చూపిన చిన్నప్పటి తెలుగు మాష్టారి నిండు విగ్రహం కళ్ళముందు మెదిలింది. తెల్లఖద్దరు పంచెకట్టుతో హుందాగా, ఠీవిగా వుండే ఆయన రూపం ఇప్పటికీ గుర్తే! తర్వాత కొన్నాళ్ళకు మాష్టారు ట్రాన్స్‌ఫర్‌పై వేరే ఊరు వెళ్ళటంతో... అడ్రసు కనుక్కోలేక చాలా శ్రమ పడ్డాడు. మళ్ళీ ఇన్నాళ్ళకు... ఆయన పేరు ఇక్కడ చూడటం దైవలీలగా అనిపించింది. పరధ్యానంగా నడుస్తూ ఇంట్లో అడుగుపెట్టిన కిరణ్‌కుమార్‌ని తండ్రికి పరి చయం చేస్తూ... "నాన్నా! వీరే మా తెలుగు సార్! మిమ్మల్ని కలవాలని వచ్చారు..." అంది పొంగిపోతూ.

అన్యమనస్కంగా దీర్ఘాలోచనలో ఉన్న కిరణ్‌కుమార్‌కి "సార్! వీరే మా నాన్నగారు..." అన్న సాహితి పిలుపుతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చింది అతని మనసు.

ఎదురుగా పండుటాకులా వున్న తన చిన్నప్పటి సుందరరామయ్య మాష్టార్ని చూశాడు కిరణ్‌కుమార్. అతని కళ్ళు చిప్పిల్లాయి. పెల్లుబికిన అభిమానంతో "బావున్నారా! మాష్టార్...!" ఆర్ద్రంగా అడిగాడు.

శిశిరంలో వయస్సు ఉడికిన సుందరరామయ్య అతన్ని వెంటనే పోల్చుకోలేకపోయాడు. ఉపాధ్యాయ వృత్తిలో అనేక ఊర్లు తిరుగుతూ... ఎందరో పిల్లలకు విద్య చెప్పాడు, పుస్తకాలు కొనుక్కోలేని పేద విద్యార్థు లకు బుక్స్ కొనిచ్చాడు. ఎందరో నిరుపేద విద్యార్థులను ఆదరించి వాళ్ళ భవిష్యత్తుకు విద్య ద్వారా బంగారు బాటను వేశాడు. ఎందరో విద్యార్థులు అతని వల్ల సాయం పొందారు. పైగా వృద్ధాప్యం కారణంగా కాస్త మతిమరుపు కూడా వచ్చింది.

## శివరాత్రి పర్వదినం!

కైలాస శిఖరం శంకరుని నిలయం
పార్వతీమాత ఆశించె నీ సహచర్యం..!
పుత్రవాత్సల్యాన్ని పొందె విఘ్నవినాయకం
హిమాలయాలలో ప్రతిధ్వనించె పంచాక్షరీ మంత్రం..!
అభిషేకప్రియుడు ఆ ఆదిశంకరుడు
హాలాహలాన్ని హరించిన గరళ కంఠుడు..!
చంద్రుణ్ణి సిగపై ధరించిన చంద్రమౌళీశ్వరుడు
గంగను భువికి ప్రసాదించిన గంగాధరుడు..!
శంభో శంకరా! అన్న పిలుపుతో ఉప్పొంగె భోళాశంకరుడు
పవిత్ర రుద్రాక్షమాలలను ధరించిన అభయంకరుడు..!
కాలసర్పాలను ధరించిన నాగభైరవుడవు
స్మశానమే నివాసమైన కపాలమాలాధరుడవు..!
తన్మయత్వంలో నర్తించే శివతాండవ విన్యాసం
మహనీయులకు అది నయనానందకరం..!
నిత్యం శివనామస్మరణం బహుజన్మల పుణ్యఫలం
పవిత్ర గంగానదీస్నానం కైవల్యానికి ముక్తిమార్గం..!
శ్రీశైల శిఖర దర్శనం మన పూర్వజన్మ సుకృతం
పవిత్ర శైవక్షేత్రాల దర్శనం సర్వపాపహరణం..!
శివాలయాలలో భక్తితో నిర్వహించే రుద్రాభిషేకాలు
నమక, చమకాలతో సాగే వేదమంత్ర పఠనాలు..!
లింగోద్భవవేళ ఆదిదంపతులకు కళ్యాణ వేడుకలు
విశ్వశాంతికి అవి సదా సర్వశుభ సంకేతాలు..!!

తంగెళ్ల పాండురంగశర్మ

''గుర్తుకురావటంలేదు...
క్షమించండి... మీరు...'' అన్నాడు
కూర్చోమని కుర్చీ చూపుతూ.
తన చిన్ననాటి జ్ఞాపకాలను ఏకరువు పెట్టాడు

కిరణ్. చివరకు తన వద్ద చదువుకున్న విద్యార్థి అని తెలియటంతో ఆనందపరవశుడయ్యాడు సుందరరామయ్య మాష్టారు.

''ఏమిటో కిరణ్! పెద్దతనంతో వచ్చిన మతిమరుపు... కాస్త చూపులో కూడా తేడా... అందుకే వెంటనే మనుషుల్ని పోల్చుకోవటం ఇబ్బందిగా వుంది. ఏమీ అనుకోకు...'' అంటూ కిరణ్ కుమార్ క్షేమ సమాచారాల్ని కనుక్కున్నాడు మాష్టారు.

తను సాహితి చదువుతున్న కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నానని కిరణ్ కుమార్ చెప్పటంతో మరీ సంతోషించాడు సుందరరామయ్య.

తన తండ్రి శిష్యుడని తెలిసి చాలా ఆనందించింది సాహితి. కాఫీ ఫలహారాలు తెచ్చి ఇచ్చింది. సుందరరామయ్య అభ్యర్థన మేరకు... ఆరోజు భోజనం అక్కడే చేశాడు కిరణ్ కుమార్.

ఎక్కడో దూరాన వున్న తన కొడుకు భరత్ గుర్తుకొచ్చాడు సుందరరామయ్యకు. అతని మనసంతా వేదనా భరితమైంది. ఆయన కనుకొలకుల్లోంచి కన్నీరు ఉబికింది. అది గమనించిన కిరణ్ కుమార్... ''ఏం మాష్టారు! ఏదో వెలితిగా ఉన్నారు...'' అంటూ ఆప్యాయంగా అడిగాడు.

ఆ మాటకు సమాధానంగా కిరణ్ చేతిని గట్టిగా నొక్కాడు... దీర్ఘ నిశ్వాసం తీస్తూ... సుందరరామయ్య.

''కిరణ్! సాహితి నా గారాలపట్టి. నా మాటపై గౌరవంతో తెలుగును సబ్జెక్టుగా ఎన్నుకుంది. ఇక మావాడు ఎక్కడో... విదేశాల్లో... దేశానికి... కన్నవారికి దూరంగా... సంపాదనా పరుగుపందెంలో... ప్చ్...'' ఆవేదన సుళ్ళు తిరిగింది ఆయనలో.

''బాధపడకండి మాష్టారూ! సాహితి మంచి తెలివితేటలున్న అమ్మాయి.మీ ఆశయాలను,భావాలను పుణికిపుచ్చుకొంది. తప్పనిసరిగా మీకు మంచి పేరు తెస్తుంది. ఇన్నాళ్ళూ మీకోసం నేను ఎంత పరితపిం చానో... మీ ప్రోత్సాహం... ఆనాడు యాక్సిడెంట్‌లో తల్లిదండ్రు లను కోల్పోయిన నన్ను చేరదీసి విద్యా బుద్ధులు చెప్పిం చారు. మీ ప్రోత్సాహమే నన్నీనాడు మని షిగా నిల బెట్టింది. మీ ఋణం తీర్చుకోలేనిది!

నాకు మాత్రం ఎవరున్నారు. ఒంటరి వాడిని. మళ్ళీ ఇన్నాళ్ళకు తిరిగి మిమ్మల్ని కలుసుకోవటం చాలా ఆనందంగా వుంది. ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను. నా ఆసరా మీకు తప్పక వుంటుంది....'' అంటూ ఎంతో ధైర్యంతో మాట్లాడుతోన్న కిరణ్ కుమార్ మాటలు సుందరరామయ్యకు కొత్త శక్తిని ఇచ్చాయి.

పైకి లేచి తన గదిలోని బీరువా లను చూపుతూ, గోడకు వేలాడుతోన్న సాహితీ మూర్తుల చిత్రపటా లను చూపిస్తూ...

''కిరణ్! ఈరోజుల్లో మనిషిని ధనపిశాచం ఆవహించింది. మానవత్వం మృగ్యమైపోయింది.మనిషికి మనిషే సమాధికడుతున్నాడు. విలువలన్నీ అంతరించిపోతున్నాయి. ప్రతివాళ్ళు సంపాదనా దురాశ పరుగులో నలిగిపోతున్నారు. ప్రేమతో పలకరించే మనిషేలేక అశాంతితో అలమటించిపోతున్నారు. ప్రతి వారినీ ఏదో అభద్రతా భావం వెంటాడుతోంది. మాతృభాషను ఎండగట్టే చదువులు. మాతృదేశ భవితవ్యాన్ని కాలదన్ని డబ్బు ఆశతో విదేశాలకు తరలిపోతున్న మేధో సంపత్తి! ఇక్కడ మన కళ్ళెదుటే అజ్ఞానంతో, ఆకలి మంటలతో అలమటిస్తోన్న అభాగ్యులు,అనాథలు ఎందరో!దేశ సౌభాగ్యం... సమాజ కళ్యాణం పనికిరాని పదాలయ్యాయి! ప్రతిదీ వ్యాపారమే!

ఈ విషమ పరిస్థితుల్లో మనల్ని మనమే బాగుచేసుకోవాలి. నువ్వు పేపర్లో చూస్తూనే వుండివుంటావు. తెలుగు భాష మాట్లాడేవారి శాతం ఇప్పటికి రవై ఐదు శాతం పడిపోయింది. ఇంకా ఈ పరిస్థితే కొనసాగితే మన జాతే అంతరించిపోతుంది. దీనిపట్ల సమాజాన్ని జాగృతం చేయాల్సిన అవసరం... మీలాంటి యువకుల భుజస్కంధాలపై ఆధారపడి వుంది!'' అంటూ ఉత్తేజపూరితంగా సుందరరామయ్య గారు మాట్లాడిన మాటలు కిరణ్ కుమార్ అంతరంగాన్ని కదిలించాయి.

''నూటికి నూరుశాతం మీరు చెప్పింది వాస్తవం. నావంతు కృషిగా మీరిచ్చే సూచనలతో భాషాభివృద్ధికి సాయం అందిస్తాను. మాతృభాషను పరిరక్షించే ఉద్యమానికి ప్రాణంపోసి నడిపిస్తాను...'' సుందరరామయ్యగారి ఆశయ సాధనకై తానూ ప్రతినపూనాడు కిరణ్‌కుమార్.

తృప్తిగా సేదతీరింది మాష్టారి మనసు.

సాహితి తమ పెరటిలోని తోటను చూపించటానికి కిరణ్ కుమార్‌ను తీసుకెళుతూ... తూలిపడబోయింది. ఆమె చంకలోని క్రచర్స్ జారిపోయాయి. ఆక్షణంలో ఆమె నిలబడటానికి కిరణ్‌కుమార్ చేతులు ఆసరా అయ్యాయి.

ఆ దృశ్యాన్ని దూరం నుంచి గమనించిన సుందరరామయ్య మాష్టారి నయనాల్లో సాహితి జీవితంపట్ల ధైర్యం తొంగిచూసింది.

అప్పుడే ఆకాశవీధిలోని నిండు జాబిల్లి పిండి ఆరబోసినిట్లు వెన్నెలను కురిపిస్తోంది.

సాహితిని చేయిపట్టుకుని నిలబెట్టిన కిరణ్‌కుమా ర్‌కి... మాష్టారు గారు చేసిన సాయానికి కృతజ్ఞతలు చూపించాల్సిన తరుణం ఆసన్నమైందని మదిలో
కొత్త ఆలోచన రెక్కలు
చాస్తూ రివ్వున ఎగిరింది. ■

## నాన్న

ఈ విశాల విశ్వంలో
కన్ను తెరవడాన్జికి
కారణం - నీవు
బుడి బుడి అడుగులకు
నడకలు నేర్పింది
చేయి పట్టి నడిపించింది
దారి చూపించిందీ - నీవే!
బలపం పట్టించి
అక్షరాల్ని డిగ్రీలదాకా
తీర్చిదిద్దిందీ- నీవే
ఎనభై ఒడిలో పడికూడా
నలభై వడిలోవలె
బ్రతుకు బండిని
ఈడ్చిందీ-నీవు కాదా?
రెక్కలొచ్చిన పక్షులన్నీ
గూడు వదిలి ఎగిరిపోగా
గుండె దిటవు చేసికొని
బండరాయిలా
మిగిలిపోయింది-నీవే... నీవే!
జీవిత గ్రీష్మంలో కూడా
వంగక, కృంగక
నిటారుగా నిలుచున్న
నిన్ను చూసి
లోకమంతా వంగి వంగి
దండం పెట్టింది
కల్పవృక్షమంటే తెలియదు
కామధేనువునూ చూడలేదు, కాని
నాన్నంటే నాకు తెలుసు
నాన్నంటే
జీవితానికి నాంది
నాది అనేది మిగుల్చుకోకుండా
సర్వం పిల్లలకు ధారపోసే
నయాగారా జలపాతం-నాన్న!

రవి ఠాకూర్

## పప్పులో కాలు

పప్పు ధర పెరిగింది
పప్పులో కాలేకాదు
చెయ్యికూడా వెయ్యడం
మానేసాను! వారెవ్వా!!

జి.వి.ఎస్.ప్రియంవద